# నాన్న

అస్తమయ సూర్యుడిని మింగేస్తున్న నల్లమబ్బులు... విసురుగాలి. వేసవికిది మామూలే... గాలి దుమారాలు, వడగళ్ళ వానలు... దుమ్ము.

నెలలో చివరి ఆదివారం అమ్మా, ఆవిడ స్నేహితురాలు డాక్టర్ మెహరున్నీసా 'విశ్రాంతి మందిరంలో' పండు మానవులని దర్శించి, వాళ్ళు అడిగినవి కొన్ని, అడగనివి కొన్ని కొని ఇచ్చి, కబుర్లు చెప్పి, రక్తపోటూ, గుండె స్పందనలు చూసి వస్తూ వుంటారు. నేను కానీ, నా సహచరుడు రవి కానీ వారి సహృదయతకి కాస్త సాయంగా కార్లో అక్కడికి తీసుకు పోయి తీసుకొస్తాము. అది కొన్నాళ్ళ అలవాటు. ఈ ఆదివారం నేను వెళ్ళదలిచాను. అందుకు నాకు మాత్రమే తెలిసిన కారణం ఒకటుంది. అసలే వర్షం వచ్చే సూచనలు. ఇప్పుడు రవి వెళ్ళాడంటే ఒక పట్టాన అక్కడనుంచి వూడి పడడు. రోజూ ఉదయపు నడకలో పరిచయమైన అనేక మంది 'పండు'లే కాక ఇక్కడి వాళ్ళను కూడా వదలడు.

నేను కారు తీసి బయట నిలబడ్డాను. అమ్మ ఇంకా పైనించి దిగి రాలేదు. రవి వచ్చి నా పక్కన నిలబడ్డాడు. ఎదురింట్లో ఉండే మహతి ఈ మధ్య వాళ్ళ నాన్నని తీసుకొచ్చింది. అప్పటినించీ ఆ కుటుంబాన్ని చూడ్డం రవికి ఇష్టం. మహతి పిల్లలిద్దరూ తాతతో ఆడ్డం, మహతి వాళ్ళాయన మామగారిని స్కూటర్ ఎక్కించుకుని పార్కులో దింపి మళ్ళీ ఆయన నడక అయ్యాక ఎక్కించుకు రావడం, వరండాలో ఆయన పడక కుర్చీలో కూర్చున్నప్పుడు, మహతి ఆయన భుజాల చుట్టూ చేతులు వేసి ఏదో చెప్పి ఆయన్ని గలగల నవ్వించడం అన్నీ ఇష్టం రవికి.

మహతి వాళ్ళమ్మ ఈ మధ్యనే క్యాన్సర్‌తో పోయింది. అప్పటినించీ బ్రతిమిలాడగా నెలకిందట కూతురిదగ్గరకి వచ్చాడు ఆయన.

రవికి 'నాన్న' అంటే ఇష్టం. వాళ్ళ వూరు వెళ్ళినప్పుడల్లా వాళ్ళమ్మ ప్రతిగదిలోనూ పెట్టుకున్న ఆయన ఫొటోలని తుడిచి తాజాగా గంధం పొట్టు దండలు కొని వేసి వస్తూంటాడు. తన టేబిల్ మీద కూడా ఒకటి పెట్టుకున్నాడు. అప్పుడప్పుడూ అద్దంలో చూసుకుని "నాకు మా నాన్న పోలికైనా రాలేదు. అచ్చం మా అమ్మలా వుంటాను" అనుకుంటాడు.

మహతీ వాళ్లు మాముందునుంచే టాక్సీ ఎక్కి ఎక్కడికో పోయారు. అమ్మ వచ్చి కారెక్కుతుండగా, ఒక చిన్న హెచ్చరిక చేశాను "నువ్వుగాని త్వరగా తెమలకపోతే వర్షంలో ఇరుక్కుపోతాం.." అని.. మెహర్ పిన్ని తక్కువదేం కాదు. అమ్మ కన్న నాలుగాకులు ఎక్కువే చదివింది. వెళ్ళే దారిలో ఆవిడకి కనీసం గంట షాపింగ్ వుంటుంది. శామ్యూల్ గారికి దుప్పటీ, అన్నపూర్ణమ్మకి వేసవిలో కట్టుకోవడానికి పలుచని చీరెలు, ఇంకెవరికో స్వెట్టర్ అల్లడానికి ఊలు, మరొకరికి మందులు, ఇంకొకరికి ట్రాన్సిస్టర్ బాటరీలు... ఎన్నో వుంటాయి. పళ్ళూ, తిళ్ళూ సరే సరి. అయినా కానీ హెచ్చరికలు పక్కనపెట్టి వాళ్ళు పదే పదే కారు ఆపించి అటుపొమ్మని, ఇటుపొమ్మని మొత్తానికి ట్రంక్ నింపేశారు. అప్పటికే చినుకులు మొదలయ్యాయి. అక్కడ నరసమ్మా, విశ్వనాథం, క్రిస్టోఫర్ మొదలైన వాళ్ళు మెహర్ పిన్నిని వదిలిపెడితేనా? ఒకరికి రోజూ కన్న ఎక్కువసార్లు బాత్‌రూమ్‌కి వెళ్ళాల్సొచ్చింది, ఇంకొకరికి రాత్రంతా నిద్రలేదు. మరొకరికి గుండె ఎక్కువగా కొట్టుకుంటున్నట్టనిపించింది. వాళ్ళని విడిపించుకోడం పిన్నికంత సులభం కాదు. మందులు ఇచ్చి, మాటలు చెప్పి, భుజాల మీద చేతులు వేసి మళ్ళీ వస్తానని చేతుల్లో చెయ్యివేసి, విడుదలయ్యేవేళకి ఫెళఫెళ మంటూ వాన రానే వచ్చింది. ఇద్దరు విలువైన వ్యక్తుల్ని ఉరుములు, మెరుపుల మధ్య ఇంటికి చేర్చడానికి ఎంత జాగ్రత్తగా నడపాలి బండి? పైగా అమ్మ రేపు తెల్లవారుతూనే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ వెళ్ళాలి. అక్కడ తనకో సెమినార్ వుంది. సాయంత్రమే పేపర్లు సిద్ధం చేసుకుని బట్టలు కూడా సర్దేసుకుంది. అంత పొద్దున్నే మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దని టాక్సీకూడా చెప్పేసింది. వర్షం ఉధృతమై వైపర్లకీ, కళ్ళకీ బాగా పని పెట్టింది.

గుమ్మంలో కారు దిగుతూనే అమ్మ లోపలికి పరిగెత్తితే, నేను కారు తాళం వేసుకుని లోపలికి వస్తూ... హాల్లో కూచున్న వ్యక్తిని చూశాను. ఎక్కడో పరిచయం వున్న మొహంలా అనిపించింది. రవి పరిచయస్థుడు కావచ్చు. వర్షం వచ్చిందని ఆగిపోయి వుంటాడు అనుకుంటూ లోపలికి పోతుంటే పిలిచాడు.

"ఈమే వసంత..." అని నన్ను పరిచయం చేస్తూ, "ఈయన రామ్మోహనరావుగారు. మీ నాన్నగారట" అన్నాడు ఏ ఉద్వేగమూ కనపడనీయకుండా, మహా నిబ్బరంగా.

చలనం కోల్పోయినదానిలా ఒక్క క్షణం గోడకానుకుని తమాయించుకుని, లోపలికి వెళ్ళాను. అప్పటికే అమ్మ బియ్యం కడిగి కుక్కర్‌లో పెట్టబోతోంది. రొప్పుతూ, 'హాల్లో

వున్నాయన్ని చూడు... పేరు రామ్మోహనరావుట. మా నాన్నట... వచ్చి గుర్తు పట్టు... తరువాత ఏమంటావో నీ ఇష్టం.' ఆవిడని చెయ్యి పట్టుకుని లాక్కుని వచ్చాను.

చూసింది. గిర్రున తిరిగి వంట ఇంట్లోకి వచ్చింది. వాన కురుస్తూనే వుంది.

"అతనే!" అని కడిగిన బియ్యంలో మరో రెండు గుప్పెళ్ళు వేసి, అక్కడే కుర్చీలో కూచుంది. కౌంటర్ పైన కిటికీ కున్న సన్‌షేడ్‌పై పడే వర్షపు ధారలు దీపం వెలుగులో పూసల దండల్లా మెరుస్తున్నాయి. గాలి విసురుకు స్టవ్ మంట చెదురుతుందని కిటికీ మూసేశాను.

నీలం జీన్స్, తెల్లని టీ షర్ట్. ఖరీదుగా కనిపిస్తున్న కళ్ళజోడు, వెండి క్రాపూ, జామిపండు ముఖం. నన్ను పరిచయం చేసినప్పుడు ఆయన చిరునవ్వుకి నేను ప్రతిగా నవ్వలేదు. నవ్వుతానని ఆశించి వుండడు కనుక ఆయన ముఖంలో ఎటువంటి ఆశాభంగమూ కనిపించలేదు.

రవితో నా పరిచయం స్నేహమై, అది స్థిరపడి ఒకరి వ్యక్తిగత విషయాలు ఒకరం తెలుసుకుంటున్నప్పుడు. అతను "అయ్యో! నీకూ నాన్నలేడా? మన ఇంట్లో ఒక నాన్నైనా వుంటాడనుకున్నాను" అని చాలా నిరుత్సాహపడిపోయాడు.

"నువ్వు మీ ఇంట్లో గదిలో మీ నాన్నని చూస్తూ వుంటావు. మా ఇంట్లో ఆయన ఫోటో కూడా లేదు ఎలా వుంటాడో కూడా తెలీదు. ఫొటో వున్నా, మేం నీలా దానికి దండలు వెయ్యలేం... ఎందుకంటే ఆయన బ్రతికే వున్నారు. మా దగ్గర లేరంతే" అని చెప్పాను. రవి తల్లిదండ్రులు కలిసి బ్రతికింది కేవలం మూడు సంవత్సరాలే. ఆ మూడేళ్ళలో ఆవిడకి ఆయన ఆరాధ్యదైవం అయిపోయాడు. ఆయన్ని గురించి కొడుక్కి ఎంతో గొప్పగా చెప్పింది. అంతే కాదు. తండ్రి లేకపోవడం దురదృష్టమనీ, ఆయనే వుండి వుంటే రవిని ఇంకా వృద్ధిలోకి తెచ్చేవాడనీ చెప్పింది. అదంతా రవి ఒంటపట్టించుకున్నట్లు లేదు కానీ తండ్రి లేకపోవడం వృత్తంలో ఒక క్వాడ్రంట్ లేకపోవడమని అంటాడు. అనుకోకుండా వచ్చిన వర్షం ఆగకుండా కురుస్తూనే వుంది. నేను బట్టలు మార్చుకుని వచ్చి అమ్మ పక్కనే కుర్చీలో కూచున్నాను. మాటలు లేవు. అమ్మ ముఖంలోకి చూశాను. ఏ భావమూ కనపడలేదు.

ఆవిడే టేబుల్ మీద నాలుగు కంచాలు పెట్టింది. రవి ఆయన్ని భోజనానికి తీసుకువచ్చాడు. అమ్మా, నేనూ మౌనం. రవి ఆయనకి ఏం కావాలో కనుక్కున్నాడు. భోజనం అయ్యాక అతిథుల గదిలో పక్క వేశాడు. వర్షం తగ్గనే లేదు. అమ్మ పైకి తన ఇంట్లోకి వెళ్ళిపోయింది. మేం వుండే ఇల్లు అమ్మదే. అందులో మమ్మల్ని వుండమని తను పైన రెండు గదులు వేసుకుంది. తనొక్కతే వుంటుంది. ఎవరి ప్రయివసీ వాళ్ళకి కావాలంటుంది.

"ఆయన నీతో మాట్లాడాలనుకుంటున్నాడు" అన్నాడు రవి.

పైకి ఎగతన్నుకు వస్తున్న ఉద్వేగాలను అణిచిపెట్టి, ఆయనతో మాట్లాడే ఆసక్తి నాకేమీ లేదన్నట్లు చెక్క మొహం పెట్టుకుని ఆయన ఎదురుగా కూచున్నాను.

ఆయన చెప్పాడు. ఆవిడ పోయాక అమెరికన్ కోడలు అక్కడికి తీసుకుపోయింది. అక్కడ జీవితం నచ్చలేదు. వచ్చేసి బెంగుళూరులో ఒక హోమ్‌లో వుంటున్నాడు. హైదరాబాద్‌లో ఒక స్నేహితుడికి జబ్బుగా వుంటే చూడ్డానికి వచ్చి హోటల్లో దిగాడు. నన్నూ, తమ్ముణ్ణి చూసిపోదామని వచ్చాడు. నాకు నవ్వొచ్చింది. ఇప్పుడిక్కడ నా తమ్ముడు ఉండి వుంటే ఎలా ప్రతిస్పందించేవాడో! మహాలక్ష్మి గారి అల్లుడైన రవికి భూతదయ జాస్తి. వర్షంలో వచ్చిన పెద్దాయన్ని అలా ఎప్పటికీ అవమానించడు. ఇప్పుడాయన చెప్పినవాటిల్లో కొన్ని మాకు తెలిసినవే. కొన్ని తెలియనివీ వున్నాయి. ఆంధ్రదేశంలోని బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, అసూయాపరులు, వార్తాహరులెందరో! వార్తలకి రంగూ, రుచీ, వాసనా జోడించి వడ్డిస్తూంటారు. విన్నాను ఆయన చెప్పినదంతా పెదవి విప్పకుండా.

"పొద్దుపోయింది పడుకోండి" అని లేచి వచ్చాను.

మళ్ళీ నవ్వొచ్చింది. "చూసి పోదామని" వచ్చాడు. మంచిదే! ఎప్పుడు వెళ్ళినవాడు ఎప్పుడొచ్చాడు?

అమ్మ పైన లైట్లు తీసేసి పడుకున్నట్లుంది. ఆవిడ అనుకున్న కార్యక్రమాలేవీ ఆగవు. ఈ అగంతకుడితో ఆవిడకేమీ సంబంధం లేదు. తన హృదయ కవాటాలను మూసేసింది. ఆ మనిషి తాలూకు కనీసపు గుర్తుల్ని కూడా చెరిపేసింది. అతన్ని గురించిన ప్రసక్తి మా ఇంట్లో ఎప్పుడూ రాదు. ద్వేషమూ లేదు. అనురాగమూ లేదు. అలా అని క్షమాపణల ప్రసక్తీ లేదు. ఆ బొమ్మని తుడిచేసిందంతే!

ఆమె జీవిత ఘట్టాలు తాతయ్య చెబితేనే నాకు తెలిశాయి. అమ్మమ్మకి ఆయనంటే చాలా కోపం. ఆ పేరు తన దగ్గర ఎత్తవద్దనేది.

మహాలక్ష్మి విజయవాడ స్టెల్లా కాలేజీ హాస్టల్లో వుండి బి.ఎ. ఇంగ్లీష్ చదివేటప్పుడు, ఆదివారం వచ్చిందంటే వాళ్ళ నాన్న ఉయ్యూర్నించి అమ్మాయిలందరికీ సరిపడే సున్నుండలూ, చక్కిలూ మోసుకొచ్చేవాడు. అమ్మాయి శనివారం స్నేహితులతో ఏలూరు రోడ్డులో రవీంద్ర కూల్ డ్రింక్స్‌లో ఫ్రూట్ సలాడ్ తినేసి ప్రబోధా బుక్ సెంటర్‌లో మిల్స్ అండ్ బూన్‌లు అద్దెకు తెచ్చుకుంటూ, నవరంగ్‌లో ఇంగ్లీషు సినిమాలు చూస్తూ బుద్ధిగా చదివి ఫస్ట్‌క్లాసులో పాసయ్యింది. వాళ్ళ నాన్న సుబ్బయ్య, అమ్మాయికి లక్షణమైన బ్యాంక్ ఆఫీసర్ సంబంధం తెచ్చి అంత లక్షణంగానూ పెళ్ళి చేశాడు. ఎవరెవర్నో పట్టుకుని అతగాడిని విజయవాడ బదిలీ చేయించాడు. అద్దెకు లక్షణమైన ఇల్లు కుదిర్చి దాన్నిండా సరికొత్త సామాన్లు నింపాడు.

వాళ్ళమ్మ సరోజినమ్మ ఉయ్యూర్నించీ వారానికొకసారి బస్సెక్కి, కూరగాయలు, కోడిగుడ్లు, కొబ్బరి బొండాలు మోసుకొచ్చేది. పనిచేసి పెట్టడానికొక పిల్లను కూడా తెచ్చింది. సుఖపడ్డం అంటే అదీ, అదృష్టం అంటే అదీ అనుకునే వాళ్ళు ఇరుగూ పొరుగూ. నల్లేరు మీద నడకలాంటి సంసారం కదా, అది ! నాలుగేళ్ళపాటు.

మహాలక్ష్మి వరండాలో కూచుని అప్పుడే వచ్చిన వారపత్రికలో సీరియల్ చదువుతోంది. ఆమె మూడేళ్ళ కూతురు వసంత చాప మీద కూచుని బొమ్మలతో ఆడుతోంది. కడుపులో పిల్లవాడికి అంతసేపు అమ్మ కదలకుండా కుర్చీలో కూచుందని కోపం వచ్చి అటూ ఇటూ కదలడం మొదలుపెట్టాడు. కాసేపు లేచి నిలబడదాం అనుకుంటోంది మహాలక్ష్మి. అప్పుడు ఆమె భర్త బ్యాంక్ నించీ కాబోలు రొప్పుతూ హడావిడిగా వచ్చి...

"లక్ష్మీ! నేను అర్జంటుగా హైదరాబాద్ వెళ్ళాలి. రావడానికి వారమైనా పట్టొచ్చు. మీ అమ్మని పిలిపించి తోడుంచుకో" అని చెప్పేసి సూట్కేసొకటి చేతపట్టుకుని 'వెళ్ళిపోయాడు.'

అమ్మాయి కాకి చేత కబురంపితే చాలు, అమ్మా నాన్నా దొరికిన బస్సు పట్టుకుని వాలిపోయేవాళ్ళు. మహాలక్ష్మి తల్లి వచ్చిందంటే ఇల్లంతా సర్దేది. అన్నీ అమర్చేది. పండగలకి బట్టలు కొనేది. ఇంటిఖర్చులకని ఎంత ఇచ్చినా మహాలక్ష్మి అతన్నెప్పుడూ డబ్బు లెక్కలు అడిగేది కాదు. తన అత్తమామల ఆర్థిక స్థితి ఆమెకి తెలుసు. వాళ్ళకి పంపుకోడంలో తనకేం అభ్యంతరం వుంటుంది?

వారం అయినా అతను రాలేదు. ఆ విషయం తల్లి జ్ఞాపకం చేసే దాకా మహాలక్ష్మి పట్టించుకోలేదు. అతనలా అప్పుడప్పుడూ వెడుతూనే వుంటాడు. వారం రోజులు ఇంట్లో పనులు యథాప్రకారం నడుస్తాయి. పిల్ల ఆడుకుంటుంది. స్నేహితురాళ్ళు ఫోన్ చేస్తారు. పుస్తకాలున్నాయి చదువుకోడానికి. వినడానికి పాటలున్నాయి. ఎప్పుడైనా సినిమాలున్నాయి. కడుపులో పిల్లవాడింకా తనని పెద్దగా ఇబ్బంది పెట్టడం లేదు.

"అదేంటమ్మా? వెళ్ళినవాడు ఫోన్ చేయొచ్చుగా? పది రోజులైంది. ఇక్కడ బ్యాంక్లో అడిగి ఫోన్ నెంబర్ తీసుకో" అని తల్లి గొడవ చేసింది.

చదువుతున్న బార్బరా కార్ట్లండ్ నవలని పక్కన పెట్టి బ్యాంక్కి ఫోన్ చేసింది మహాలక్ష్మి. వాళ్ళు ఆమె నెత్తిమీద ఒక బండరాయి వేశారు... అతను ఆఫీస్ పనిమీద వెళ్ళలేదు. లీవ్ మీద వెళ్ళాడు. బొంబాయి నించీ లీవ్ పొడిగిస్తూ ఉత్తరం పంపాడు. వాళ్ళనడిగి బొంబాయి అడ్రస్ తీసుకుంది మహాలక్ష్మి. ఉత్తరాలకి జవాబులు లేవు.

ఉయ్యూరునించి సుబ్బయ్య వచ్చాడు. నిజానిజాలు కనుక్కొచ్చి రంకెలు పెట్టాడు. రామ్మోహన్ తల్లితండ్రుల దగ్గరకు వెళ్ళి నోటికొచ్చినట్టు తిట్టివచ్చాడు. బంధువులని, మిత్రుల్ని అయిన వాళ్లని, కానివాళ్ళని ఆరాలు అడిగాడు. పోలీసు కేసు పెడతానన్నాడు. సరోజినమ్మ

గుండెలు బాదుకుంది. 'ఎంత కట్నం పోశాం వాడి ఏదాన?' అని ఏడ్చింది. ఈలోగా అతను తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చినట్లు తెలిసింది.

పోలీస్ రిపోర్ట్ వద్దని అయిన వాళ్ళు సలహా ఇచ్చారు. కడుపులో పిల్లవాడు భూమిమీద పడేదాకా పిల్లని ప్రశాంతంగా వుంచమన్నారు.

మహాలక్ష్మి నవలలూ, పత్రికలూ పక్కనపెట్టి ఆలోచించడం మొదలు పెట్టింది. వార్తాహరులు వార్తలు చేరవేస్తునే వున్నారు.

ఉన్నట్లుండి ఒకనాడు తండ్రికి చెప్పింది."మనకి అతనొద్దు నాన్నా! ఆవిడనే వుంచుకోనియ్. అతని బ్రతుకు అతన్ని బ్రతకనియ్. మన బ్రతుకు మనం బ్రతుకుదాం" అని.

అంత గట్టి నిర్ణయం ఆమోదించడానికి సుబ్బయ్యా, సరోజినమ్మా కొంత సమయం తీసుకున్నా, వాళ్ళకి ఈ ప్రపంచంలో కూతురు తప్ప మరో విషయం లేదు కనుక, చంటి బిడ్డనీ, ఎడబిడ్డనీ వాళ్ళ భుజానేసుకుని ఆమెని యూనివర్శిటీకి పంపించారు. ప్రపంచ ద్వారాలు తెరిచారు. కళ్ళల్లో బెరుకు పోగొట్టారు. కాళ్ళకి సత్తువ ఇచ్చారు.మాటకు పదును ఇచ్చారు. ఆలోచనలకి స్వేచ్ఛ ఇచ్చారు.

"నాన్న అంటే మా నాన్నే" అనుకుంది మహాలక్ష్మి.

"పెళ్ళయిన నాలుగేళ్ళదాకా ఆ మనిషికి మరో మనిషితో సంబంధం వుందని, రాకపోకలున్నాయనీ కనుక్కోలేకపోయావు. ఎంత తెలివి తక్కువ దానివే ! బొత్తిగా లోకజ్ఞానం లేదు నీకు!' అనేది సరోజినమ్మ.

"నిన్నూ, నాన్ననీ ఎలా నమ్మానో అతన్నీ అలాగే నమ్మాను. నువ్వు అనసూయత్తని చూసొస్తానని బందరు వెడతావు. నేను సరే అంటాను. నువ్వు అక్కడికి కాక ఇంకెక్కడికో వెడతావని నిన్ను అనుమానిస్తానా? నేను స్నేహితులతో ఎక్స్‌కర్షన్ వెడతానంటే మారు మాట్లాడకుండా అడిగిన దానికన్న ఎక్కువ డబ్బులిచ్చి పంపావు. అక్కడికి కాక ఇంకెక్కడికన్నా వెడతానని అనుమానించావా? అనుమానించడం మనకి అలవాట్లేదు. మీరు ఎంతో అతన్నీ అలాగే అనుకున్నాను. దీన్నే ఇంగ్లీష్‌లో టేకెన్ ఫర్ గ్రాంటెడ్ అంటారు. అలాగన్నమాట. ఇంక పోనియ్యమ్మా... మర్చిపోదాం" అంది మహాలక్ష్మి.

పెళ్ళి చేసుకుని ఇద్దరు బిడ్డలకి తండ్రైన వాణ్ణి, ఆత్మహత్య చేసుకుంటానని బ్లాక్ మెయిల్ చేసి ఎత్తుకుపోవడం ప్రేమ అయితే, అలాంటి ప్రేమ మనకొద్దు. చిన్నప్పటినించీ ఒకరికొకరుగా పెరిగి, తల్లి బావిలో పడతానని బెదిరిస్తే కట్నం కోసం మరొకమ్మాయిని పెళ్ళాడడం మాతృప్రేమ అయితే అలాంటి మాతృప్రేమ మనకొద్దు. మనకి ప్రేమలూ వద్దు, బ్లాక్‌మెయిలూ వద్దు. మనమిలాగే పల్లెటూరి వాళ్ళలా వుందాం అంది.

చదువులోనించీ, ఉద్యోగం లోనుంచీ పిల్లల పెంపకం లోంచీ వాళ్ళ చదువులు ఉద్యోగాల లోనించీ, తన ఉద్యోగ విరమణలోనించీ, ఇప్పుడు ఇతర వ్యాపకాల్లోకి విస్తరించింది మహాలక్ష్మి.

"ఆయన్ని లోపలికి పిలిచి కూచోపెట్టినందుకు అత్తయ్యకి కోపం వస్తుందా? పాపం, వర్షం కదా? పెద్దాయన. ఆవిడకి కోపం రాదనే అనుకున్నాను" అంటూ లోపలికి వచ్చాడు రవి.

"ఇంత వర్షంలో మనింటికి ఎవరొచ్చినా ఇలాగే చేస్తాం కదా? కోపం ఎందుకు?" అన్నాను.

"రేపటికి బెంగుళూరుకు ఫ్లయిట్ టికెట్ వుంది. పొద్దున్నే లేచి వెళ్ళిపోతాడు. పైకి వెళ్ళి అమ్మనొకసారి చూసిరాకపోయావా?" అన్నాడు.

"తనని ఇప్పుడు డిస్టర్బ్ చెయ్యడం ఎందుకు? పొద్దున్నే లేవాలి కదా రైలు టైముకి...ఆవిడేం ఇదంతా పెద్ద పట్టించుకున్నట్టు లేదు... ఆయన కూడా అమ్మతో మాట్లాడాలని ఏమీ అడగలేదు. చెప్పాలనుకున్నదంతా చెప్పేశాడు. మనసులో భారం ఏమైనా వుంటే దించేసుకున్నాడు." అన్నాక రవికీ, నాకూ సంభాషణ సాగలేదు. ఎవరికి వాళ్ళం నిద్రపోవాలని ప్రయత్నంలో వున్నాం. ఆయన మాటలు చెవిలోనే వున్నాయి.

"మహాలక్ష్మి జీవితంలో నేనొక భాగం. కానీ లలితకి నేనే జీవితం. అమ్మ లేదు. నాన్న వున్నా ఒకటే లేకపోయినా ఒకటే. చదువులేదు. ఆస్తి లేదు. ఆరోగ్యం కూడా అంతంత మాత్రం.. ఎప్పటినించో నామీదే మనసు పెట్టుకుంది. నేను మహాలక్ష్మిని చేసుకోడం తప్పే... మా అమ్మ వల్ల అలా జరిగిపోయింది. నేనలా అమ్మకి లొంగిపోవడం తప్పే. మహాలక్ష్మితో వున్నా నేను లలిత గురించే ఆలోచించేవాడిని. ఉత్తరాలు వ్రాసేవాడిని. కలుస్తూ వుండేవాడిని. అప్పుడప్పుడూ డబ్బు పంపేవాడిని. నేను లేనిదే ఆమె బ్రతకదనే నిర్ధారణకు వచ్చాక ఒక నిర్ణయం తీసుకున్నాను. నేను ఇద్దరిని మోసం చేస్తున్నాను. అందులో నేను ఒకర్నే ఎంచుకోవాలి. లలిత నన్ను వదలడానికి ఇష్టపడడం లేదు. ఆమె ఉత్తరాలన్నీ నిష్టూరాలతో వుంటాయి. ఆత్మహత్య గురించిన ప్రసక్తులతో వుంటాయి. ఇంకొకర్ని పెళ్ళి చేసుకోదు. ఆర్థికంగా నిలబడదు. అతి బేలగా వుంటుంది. మహాలక్ష్మికి జీవితం ఒక రొటీన్. అమ్మా, నాన్న, స్నేహితులూ, పుస్తకాలూ, పిల్లా, వీటితో పాటు నేను. నేను ఆలస్యంగా ఇంటికొచ్చినా కంగారు పడదు. ఆకలేస్తే అన్నం తినేస్తుంది. నిద్ర వస్తే పనిపిల్లకి తలుపు తియ్యమని నిద్రపోతుంది. ఆమెకు నా మీద ప్రేమ లేదని చెప్పడానికి కాదు. నేను లేకపోయినా ఆమెకేలోటూ రాదు. ఆమె తల్లిదండ్రులు ఆమెని కంటికి రెప్పలా కాచుకుంటారు. అనిపించింది. అందుకే అన్ని ఛీత్కారాలకీ, అవమానాలకీ సిద్ధపడి లలితని దక్కించుకున్నాను.

తప్పే కావచ్చు. కానీ అలా చేశాను అంతే. దానికి నాదే బాధ్యత.నేనిప్పుడు ఏ క్షమాపణలూ కోరడానికి నన్ను కుటుంబంలో చేర్చుకోమని అడగడానికి రాలేదు. ఒకసారి మిమ్మల్ని చూడాలనుకుని వచ్చాను. అంతే. మహాలక్ష్మి నన్ను తిట్టినా, అవమానించినా భరించడానికి సిద్ధపడే వచ్చాను. నన్ను ఇలా మాట్లాడనిచ్చినందుకు ఆదరించినందుకు ఎప్పటికీ కృతజ్ఞుణ్ణి.." నిబ్బరంగా చెప్పాడు ఈ నాలుగు మాటలు.

అవునూ, ఆయన్ని పరుషమైన మాటలతో గాయపరచాలని ఎందుకు అనిపించలేదు నాకు? చెప్పేదంతా చెక్క మొహంతో వినేసి బయటికొచ్చాను. మహాలక్ష్మి గారి పెంపకమా? ఎప్పటికో నిద్ర వచ్చింది. లేచేసరికే అమ్మ స్టేషన్‌కి వెళ్ళిపోయింది. ఆయనింకా లేచినట్లు లేదు. పళ్ళుతోముకుంటూ అద్దంలో చూసుకుని ఉలిక్కిపడ్డాను. అమ్మది చామనఛాయ. నొక్కులజుట్టు. పెద్ద కళ్ళు. మామూలు ఎత్తు, అయిదడుగుల మూడంగుళాలు. నేను జామపండురంగు. మెత్తని జుట్టు. బాగా పొడుగు. అయిదడుగుల ఆరంగుళాలు.

"త్వరగా కానియ్! ఆయన వెడుతున్నారు. కాఫీ ఇచ్చేశాను. హొటల్ దాకా దిగబెట్టి వస్తాను" అంటున్నాడు రవి.

"వస్తానమ్మా!" అని నా వీపుతట్టి వెనక్కి చూడకుండా కారెక్కేశాడాయన. తప్పో ఒప్పో చేసినపనికి బాధ్యత వహించాడు. పర్యవసానాన్ని నిబ్బరంగా స్వీకరించాడు. నా కళ్ళల్లోకి సూటిగా చూడ్డానికి జంకలేదు. అమ్మని పలకరించలేదు. ఆమె కన్నెత్తి చూడకపోయినా, పలకరించకపోయినా మొహంలో ఎలాంటి భావమూ కనపరచలేదు. ఆమెతో మాట్లాడ్డానికి ప్రయత్నించలేదు.

నాకు ఊహవచ్చాక ఆయన రూపం ఎరగను. ఇకమీదట అద్దం చూసుకున్నప్పు డంతా గుర్తొస్తాడు కాబోలు ! ✻

'చినుకు', ఏప్రిల్ 2009